క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆరాధనా మహోత్సవాలు



షిర్డీసాయి ధ్యాన మందిరంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

వీరఘట్టం: మండలంలోని వండవ షిర్డీసాయి ధ్యాన మందిరంలో 106వ ఆరాధనా మహోత్సవాలను సోమవారం భక్తి శ్రద్ధలతో చేపట్టారు. ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం ఆధ్వర్యంలో 108 మంది దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితుల వేదమంత్రాల నడుమ హోమ గుండం వద్ద పూజలు చేశారు. సాయి నామస్మరణతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మికత చోటు చేసుకుంది.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



లోహరిజోలలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం పరామర్శించారు. లోహరిజోల, బిల్లుమడ, బురుజోల, నల్లరాయిగూడలలో వివిధ కారణాలతో మృతి చెందిన వారి బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, జేసీఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, ఎంపీటీసీ బూస బాలకృష్ణ, సర్పంచ్‌లు సిగడాన రాధాకృష్ణ, మడపాన కేశవ, బిడ్డిక గొయింతి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజ శిఖర ప్రతిష్ఠ



ఘటాలతో పవిత్ర జలాలు ఊరేగిస్తున్న గ్రామస్తులు

భామిని: మండలంలోని బాలేరులో గ్రామ దేవత మందిరానికి సోమవారం ధ్వజ శిఖర ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు సామూహిక ఘటాలతో పవిత్ర జలాలన మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి సమర్పించారు. వేదమంత్రాల మధ్య శిఖర ప్రతిష్ఠ చేశారు. మహిళలు కోలాటం ఆడారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



దంగబద్రలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జియ్యమ్మవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహిస్తున్నాయి. మండలంలోని జియ్యమ్మవలస, డంగబద్ర గ్రామాల్లో కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసులు సోమవారం కవాతు నిర్వహించాయి. ఎస్‌ఐ అనీష్ ఆధ్వర్యంలో కవాతు జరిపారు.

ఘనంగా బంగారమ్మతల్లి తొలేళ్ల పండగ

మక్కువ: మండలంలోని కొండ బుచ్చంపేట గ్రామంలో బంగారమ్మతల్లి తొలేళ్ల పండగను భక్తులు ఘనంగా జరిపారు. సోమవారం సాయంత్రం అమ్మవారి ఘటాలకు అలంకరణ నిర్వహించి, గ్రామంలో తిరువీధి నిర్వహించారు. భక్తులు అమ్మవారి ఘటాలకు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఘటాలు బంగారమ్మతల్లి గద్దె వద్దకు చేరుకున్నాయి. మంగళవారం ప్రధాన పండగ, బుధవారం అనుపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రాజకీయనాయకుల స్టిక్కర్లు, వాల్‌పోస్టర్ల తొలగింపు

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటి గోడలు, తలుపులపై ఉన్న రాజకీయ నాయకుల స్టిక్కర్లు, వాల్‌పోస్టర్లను ప్రజలు స్వచ్ఛందంగా తొలగించాలని ఎలక్టోరల్ అధికారి చిన్నారావు కోరారు. సీతానగరం నుంచి పెదంకలాం వరకు స్తంభాలు, గోడలపై ఉన్న రాజకీయ నాయకుల స్టిక్కర్లు, బొమ్మలను పోలీసుల సహకారంతో సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయపార్టీల నాయకులు ఫొటోలు ఉండకూడదని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీరుపాడులో అభివృద్ధి వెలుగులు



బీరుపాడుకు నిర్మించిన పక్కా రహదారి

- వైఎస్సార్‌సీపీ పాలనలో మౌలిక వసతుల కల్పన
- మెరుగైన రవాణా సౌకర్యం
- డీబీటీ ద్వారా రూ.5.89 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.1.56 కోట్లు అందజేసిన ప్రభుత్వం

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో అభివృద్ధి ఊపందుకుంది. అందుకు నిదర్శనమే బీరుపాడు పంచాయతీ. ఈ పంచాయతీ గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. పంచాయతీలో బీరుపాడు గ్రామంతో పాటు దబ్బలగూడ, శ్రీరంగపాడు, లాడ, ఇజ్జకాయి, వాడజంగి గ్రామాలున్నాయి. ఈ గ్రామాల ప్రజలకు ఐదేళ్లలో ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ.5,89,41,594లు, పరోక్ష నగదు బదిలీ ద్వారా రూ.1,56,18,243 లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసింది.



దబ్బలగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన టవర్

బీరుపాడు పంచాయతీలో జరిగిన అభివృద్ధి

- రూ.12 కోట్లుతో 16.6 కిలోమీటర్ల మేర (దేరువాడ-నుంచి గొయిపాక పంచాయతీని కవర్ చేస్తూ బీరుపాడు వరకు) పక్కా రోడ్డు నిర్మాణం.
- రూ.42 లక్షల వ్యయంతో బీరుపాడులో గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు.
- రూ.21 లక్షల వ్యయంతో బీరుపాడులో రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణ పనులు.
- రూ.13లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులు.
- రూ.7 లక్షలతో బీరుపాడు గ్రామంలో మురుగు నీటి కాలువ, రిటైనింగ్ వాల్ నిర్మాణం.
- రూ.2 లక్షలతో దబ్బలగూడ గ్రామంలో మురుగు కాలువ నిర్మాణం.
- రూ.4.50 లక్షలతో శ్రీరంగపాడు గ్రామంలో సీసీ రోడ్డు, మురుగు కాలువ నిర్మాణం.
- రూ.50 లక్షలతో నెట్‌వర్క్ సేవలు మెరుగుపర్చేందుకు లాడ, దబ్బలగూడ గ్రామాల్లో టవర్ల నిర్మాణం.

పరిష్కారమైన సమస్యలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ప్రత్యేక చొరవతో ఈ ప్రాంత గిరిజనుల చిరకాల స్వప్నం అయిన రోడ్డు నిర్మాణం జరిగింది. ఆర్టీసీ బస్సును కూడా నడుపుతున్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేయడం జరుగుతుంది. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా సకాలంలో సేవలన్నీ గ్రామంలోనే అందుతున్నాయి. పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటునందించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– కొండగొర్రి కళావతి, సర్పంచ్, బీరుపాడు

అర్హులందరికీ పథకాలు



గ్రామంలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. వలంటీర్లే ఇంటికి వచ్చి పథకాల కోసం దరఖాస్తు చేయించడంతో పాటు ఇంటి వద్దనే పథకాలను అందజేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయం సిబ్బంది చొరవ చూపుతున్నారు. పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన సాయం వలన ఆర్థిక ఇబ్బందులు తొలగుతున్నాయి.

– కిల్లక తీలమ్మ, బీరుపాడు



బీరుపాడు గ్రామంలో నిర్మించిన మురుగు కాలువ

బీరుపాడు సచివాలయం పరిధిలో ప్రజలకు ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి(డీబీటీ)

పథకం	లబ్ధిదారులు	అందించిన లబ్ధి
జగనన్న అమ్మఒడి	204	రూ.91,08,000
జగనన్న విద్యా దీవెన	69	రూ.11,80,966
జగనన్న వసతి దీవెన	16	రూ.2,93,740
వైఎస్సార్ రైతు భరోసా	387	రూ.1,62,47,450
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	26	రూ.55,650
సున్నా వడ్డీ పంట రుణాలు	03	రూ.7,676
వైఎస్సార్ పెన్షన్ కానుక	265	రూ.2,31,60,750
వైఎస్సార్ చేయూత	131	రూ.51,56,250
వైఎస్సార్ ఆసరా	309	రూ.26,42,523
సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీలు)	329	రూ.34,802
డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	13	రూ.2,49,981
హౌసింగ్ చెల్లింపులు	08	రూ.30,350
వైఎస్సార్ బీమా	02	రూ.4,00,000
వైఎస్సార్ వాహన మిత్ర	373	రూ.3,73,000
జగనన్న తోడు(వడ్డీ)	02	రూ.456

పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) ద్వారా..

పథకం పేరు	లబ్ధిదారులు	పొందిన లబ్ధి
ఇంటి స్థలాల కోసం	03	రూ.7,38,000
జగనన్న విద్యా కానుక	209	రూ.14,84,318
ట్యాబ్‌ల పంపిణీ	28	రూ.3,70,216
జగనన్న తోడు (రుణాలు)	17	రూ.3,16,523
జగనన్న గోరుముద్ద	98	రూ.9,70,888
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	278	రూ.52,06,940
ఇంటింటికి రేషన్	299	రూ.65,31,358

ఏబీ రోడ్డు వెంబడి శిలువ పాదయాత్ర

భామిని: మండలంలోని బత్తిలి నుండి ఇసుకగూడ ప్రేమగిరి వరకు సోమవారం క్రైస్తవ దీక్షాపరులు, విశ్వాసకులు శిలువ పాదయాత్ర చేశారు. ప్రభువును స్తుతిస్తూ ప్రార్థనలు చేస్తూ ఏబీ రోడ్డు వెంబడి సుమారు ఇరవై కిలోమీటర్లు మేర శిలువ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు వెంబడి క్రైస్తవ గీతాలతో అలరించారు. ప్రతీ గ్రామ కూడలి వద్ద ప్రభువు వ్యాఖ్యలను వినిపించారు. బత్తిలి సర్పంచ్ టింగ శాంతికుమారి, చర్చ్ ఫాదర్లు తామస్ రెడ్డి, మరియ దాస్, కనోసా సిస్టర్ల పర్యవేక్షణలో పాదయాత్ర నిర్వహించారు. ఇసుకగూడ ప్రేమగిరిపై వెలసిన మేరీ మాతాను దర్శించుకొని పూజలు చేశారు. బత్తిలి, నేరడి-బి, భామిని, లివిరికి చెందిన దీక్షాపరులు పాల్గొన్నారు.



ఏబీ రోడ్డు వెంబడి శిలువ పాదయాత్రలో పాల్గొన్న దీక్షాపరులు

కళాకారుడికి ఘన సన్మానం

గరుగుబిల్లి: ఎన్నో పాత్రలను పోషించి పలువురు మన్ననలు పొందిన సీనియర్ కళాకారుడు చింతాడ తవిటాచారిని హైదరాబాద్ కేర్ ఆస్పత్రి కార్డియాలజిస్టు గుల్ల సూర్యప్రకాష్ సోమవారం రావుపల్లి గ్రామంలో దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరాణికంలో, సాంఘిక నాటకాల్లో ఎన్నో పాత్రలను పోషించి ఈ ప్రాంతంలో మంచి కళాకారునిగా గుర్తింపు తెచ్చుకున్న తవిటాచారిని సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు సూర్యప్రకాష్‌చే సన్మానించబడడం తన జీవితంలో మరిచిపోలేనిదని సన్మాన గ్రహీత తవిటాచారి అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డి.రామ్మోహనరావు, మాజీ ఎంపీపీ డి.ధనుంజయరావు, జి.సింహాచలం, జి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



తవిటాచారిని సన్మానిస్తున్న ప్రముఖ కార్డియాలజిస్టు సూర్యప్రకాష్

నాడు అధ్వానం.. నేడు అద్భుతం

కురుపాం మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ దబ్బమానుగూడ గిరిజన గ్రామ రహదారి ఒకప్పుడు టీడీపీ పాలనలో మట్టి రోడ్డుతో అధ్వానంగా ఉండేది. ఈ మార్గంలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు రహదారి కష్టాలను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె ఉపాధి హామీ నిధులు రూ.50లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో దండుసూర గ్రామం నుంచి దబ్బమానుగూడ గ్రామానికి బీటీ రహదారిని వేశారు. దీంతో ఈ ప్రాంత గిరిజన గ్రామాల రహదారి కష్టాలు తీరాయి.

– కురుపాం



అధ్వానంగా ఉన్న దబ్బమానుగూడ గిరిజన గ్రామ రహదారి



రూ.50 లక్షలతో వేసిన దండుసూర నుంచి దబ్బమానుగూడ రహదారి

పశువుల అక్రమ రవాణాపై తనిఖీలు

కురుపాం: పశువులను అక్రమంగా రవాణా చేస్తే పోలీసు, రెవెన్యూ శాఖ సమన్వయంతో తగు చర్యలు తీసుకుంటామని గుమ్మ పశు వైద్యశాల వైద్యాధికారిణి కె.శైలజ సోమవారం తెలిపారు. ఈ నెల 22న సాక్షి దినపత్రికలో ఏజెన్సీ కేంద్రంగా పశువుల అక్రమ రవాణా అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు. పశువైద్య శాఖ అధికారులు, సిబ్బంది సంతల్లో, ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఇకపై పశువులను అక్రమ రవాణా చేస్తే సహించేది లేదన్నారు. ప్రజలు తమకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని కోరారు.

ఫ్లైయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ బృంద సభ్యులు

సీతంపేట: ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సోమవారం వారపు సంత రోజున సీతంపేటలో విస్తృతంగా తనిఖీ చేపట్టారు. దోనుబాయి రహదారి కూడలి వద్ద కార్లు, ద్విచక్ర వాహనాలు, వ్యాన్‌లు వంటి వాటిని తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిబంధనలు పాటించాలని సంబంధిత సిబ్బంది సూచించారు.

ఘనంగా అయ్యప్పస్వామి తిరువీధి

సాలూరు: అయ్యప్పస్వామి జన్మదినోత్సవం సందర్భంగా పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఆలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా కోమటి పేట, కోటవీధి, శివాజీ సెంటర్‌ల మీదుగా తిరువీధి ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



విశేష అలంకరణలో అయ్యప్పస్వామి

సాంప్రదాయబద్ధంగా కామ దహనం



కామ దహన కార్యంలో నిమగ్నమైన భక్తులు, ఉత్కళ పండితులు

భామిని: మండలంలోని లివిరి గ్రామంలో వెలిసిన శ్రీగోపినాథ రాధాకృష్ణుల ఆలయంలో డోలోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి కామ దహన కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. తొలిత రాధాకృష్ణుల ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగించి, కామ దహన హోమగుండం వద్ద ప్రతిష్ఠించారు. ఉత్కళ వేదపండితుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు.

వలంటీర్లపై ఎందుకంత అక్కసు

పాలకొండ: టీడీపీ నాయకులకు వలంటీర్లపై ఎందుకంత అక్కసు అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రశ్నించారు. విలేకరులతో వారు సోమవారం మాట్లాడారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, అతని దత్తపుత్రుడుతో పాటు ఆ పార్టీ నాయకులు వలంటీర్లపై చేస్తున్న ఆరోపణలను ఖండించారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందించారని, గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. అటువంటి వలంటీర్లను కించపరిచే విధంగా మాట్లాడడం టీడీపీ నాయకుల దిగజారుడు తనానికి నిదర్శనమని ఆరోపించారు. ప్రజల దగ్గర మంచి పేరు తెచ్చుకున్న వలంటీర్లు అంటే టీడీపీ నాయకులకు రైళ్లు పరిగెడుతున్నాయని విమర్శించారు. నిస్వార్థంతో ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్లను మానసికంగా వేధించడం ద్వారా టీడీపీ నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే జన్మభూమి కమిటీలను తీసుకువచ్చి ప్రజల నోట్లో మట్టి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారని ఆరోపించారు. వలంటీర్లపై టీడీపీ నాయకులు తమ వాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: కొమరాడ మండలం తులసివలస, బందవలస గ్రామాలకు చెందిన సుమారు 40 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం చేరాయి. వీరికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో సర్పంచ్ భీమయ్య, నాయకులు బుడుమూరు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

30న అంగ వైకల్య నిర్ధారణ పరీక్షలు

పాలకొండ రూరల్: మూడు నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన దివ్యాంగుల వైకల్య నిర్ధారణ పరీక్షలు ఈ నెల 30వ తేదీన పాలకొండ భవిత కేంద్రంలో చేపట్టనున్నట్లు ఐఈఆర్టీ అరుణ సోమవారం తెలిపారు. జిల్లా సమగ్ర శిక్ష నేతృత్వంలో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాలకు చెందిన వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైకల్య నిర్ధారణ అనంతరం అవసరమైన ఉపకరణాలు జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ పి.భానుమూర్తి ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లితండ్రులు, సంరక్షకులు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కోనేరుకు కొత్త రూపు

- రూ.32లక్షలతో అభివృద్ధి పనులు

పాలకొండ: నగర పంచాయతీలోని కల్యాణి కోనేరు కొత్త రూపు సంతరించుకుంది. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో వడమ ప్రాంతంలో ఉన్న ఈ కోనేరు ఎన్నో ఏళ్ల నుంచి నిర్లక్ష్యానికి గురై మురుగుతో దుర్గంధభరితంగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ కోనేరును అమృత సరోవర్‌లో ఎంపిక చేసి రూ.32లక్షలు మంజూరు చేసింది. దీంతో కోనేరు రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. కోనేరు పూడికలు తొలగించి గట్టుపై ఆక్రమణలు తొలగించారు. ఉదయం మార్నింగ్ వాక్ కోసం ట్రాక్ నిర్మాణం చేశారు. కోనేరు గట్టును సుందరంగా మార్చి గేట్లు ఏర్పాటు చేయడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలు లేకుండా చర్యలు తీసుకున్నారు. గట్టుపై సేద తీరేందుకు బల్లలు ఏర్పాటు చేశారు.



సుందరంగా కల్యాణి కోనేరు

సందడిగా రంగుల హోలీ



సీతంపేట: దేవనాపురంలో రంగులు పూసుకుని హోలీ జరుపుకుంటున్న చిన్నారులు



పాలకొండ రూరల్: రిజర్వు ఫోర్స్ సభ్యులకు మిఠాయిలు అందిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: రంగుల హోలీ సందడిగా సోమవారం జరుపుకున్నారు. కులమతాలకు అతీతంగా చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ రంగుల హరివిల్లు హోలీ పండగ సందర్భంగా సందడి చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఇతర ప్రాంతాల నుంచి పాలకొండలో బందోబస్తు నిమిత్తం వచ్చిన రిజర్వు పోలీస్ బృంద సభ్యులతో డీఎస్పీ జీవీ కృష్ణారావు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. వారికి కేటాయించిన వసతిగృహం వద్దకు సీఐ చంద్రమౌళి, ఎస్‌ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్‌లతో కలసి చేరుకున్న డీఎస్పీ సాంప్రదాయ రంగులు చల్లుతూ సందడి చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. రంగుల హరివిల్లులు వారి జీవితాల్లో వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వ్యక్తిగతంగా ప్రతీ సభ్యునికి అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో హోలీ పండగను స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారాల నిమిత్తం వచ్చి ఇక్కడ స్థిరపడిన మార్వాడీలు సహచరులతో కలసి నిర్వహించారు.



కురుపాం: మండల కేంద్రంలో హోలీ సందర్భంగా రంగులు చల్లుకుంటున్న యువత

ఏజెన్సీలో సంబరంగా హోలీ

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో హోలీ పండగ సంబరంగా నిర్వహించారు. చిన్న, పెద్ద అంతా రంగులు పూసుకుని ఆనందించారు. సందడి చేశారు.

సందడే.. సందడి

కురుపాం: మండల కేంద్రంలో హోలీ పండగను చిన్నారుల నుండి యువత, పెద్దలు సందడిగా జరుపుకున్నారు. చెడు మీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకుంటున్న రంగుల పండగ హోలీ ప్రతీ ఒక్కరి జీవితంలో సంతోషాన్ని నింపాలని ఆకాంక్షిస్తు ఒకరిపై ఒకరు రంగులను చల్లుకుంటూ సరదాగా గడిపారు. మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డు, స్లాబ్‌కాలనీ, గాంధీనగర్, గొడువీధి, శివ్వన్నపేట, శోభలతాదేవీ కాలనీల్లో యువత హోలీని జరిపారు.